


ప్రజా **రిపబ్లిక్**

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 250 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/- | శుక్రవారం 11 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ప్రతిపక్షాలకు కుటుంబ ప్రయోజనాలే ముఖ్యం:ప్రధాని

ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టిసారిస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు.

**వారణాసి, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకుసాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. పులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు.



ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' (కుటుంబంతో కలిసి.. కుటుంబం కోసం) అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్కా సాథ్.. సబ్కా వికాస్' (అందరితో కలిసి.. అందరి కోసం) నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్ లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని పేర్కొన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు.

# తెదేపాకు మొదటి నుంచీ వెన్నెముక బీసీ వర్గాలే:సీఎం చంద్రబాబు

తెదేపాకు మొదటి నుంచీ వెన్నెముక బీసీ వర్గాలేనని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

**ఆగిరిపల్లి, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** తెదేపాకు మొదటి నుంచీ వెన్నెముక బీసీ వర్గాలేనని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తనతో పాటు ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ కలిసి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో బీసీ వర్గాలతో నిర్వహించిన ప్రజావేదికలో సీఎం మాట్లాడారు. "బీసీలకు కార్పొరేషన్లు పెట్టి ఆయా వర్గాలకు మేలు చేస్తున్నాం. ఎన్టీఆర్ హయాంలో బీసీ గురుకులాలు వచ్చాయి.



విదేశాల్లో చదువుకునే వారికి రూ.15 లక్షల సాయం అందిస్తున్నాం. సివిల్స్, గ్రూప్స్ రాసేవారికి అండగా ఉన్నాం. అమరావతిలో సివిల్స్ కోచింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. బ్యాచ్కు 500 మందికి చొప్పున శిక్షణ ఇస్తాం. ఆదరణ-3 కింద ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. నేతన్నలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం. ఇల్లు కట్టుకునే వెనుకబడిన వర్గాలకు అదనంగా రూ.50వేలు ఇస్తాం. ఎస్సీల ఇళ్లకు ఉచితంగా సోలార్ ప్యానల్స్ మంజూరు చేస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు.

"త్వరలో బీసీ సంరక్షణ చట్టం తీసుకొస్తాం. తెదేపా వచ్చాకే వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగింది. ఉద్యోగాల్లో 33, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాం. జిల్లాల వారీగా బీసీ భవన్లకు శ్రీకారం చుట్టాం. మా ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత.. వెనుకబడిన వర్గాల సంక్షేమమే. అమరావతిలో సివిల్స్ కోచింగ్

### వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరి రోజు

సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు ఇస్తున్నాం. ఈ ఏడాది లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యం. త్వరలోనే అందరికీ తల్లికి వందనం ఇస్తాం. రైతులకు అండగా ఉంటాం.. వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తాం. కోర్టు సమస్యలు పరిష్కరించి త్వరలోనే చింతలపూడి పూర్తి చేస్తాం. మే నెల నుంచి రైతులకు విడతల వారీగా రూ.20వేలు అందిస్తాం. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరి రోజు అవుతుంది. తప్పులు చేసేవారి పట్ల చండశాసనుడిగా ఉంటా. వైకాపా హయాంలో ప్రజలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది. అర్హులందరికీ స్థలం ఇచ్చి ఇళ్లు కట్టాకే మళ్లీ ఓట్లు అడుగుతాం" అని చంద్రబాబు అన్నారు.

## మహిళలపై తమిళనాడు మంత్రి అవమానకర వ్యాఖ్యలు..

# ప్రముఖుల ఆగ్రహం

మహిళలను కించపర్చేలా తమిళనాడు మంత్రి పొన్ముడి చేసిన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**చెన్నై, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** తమిళనాడు అటవీశాఖ మంత్రి కె.పొన్ముడి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచాడు. మహిళలపై అవమానకరరీతిలో అతడు చేసిన వ్యాఖ్యలకు గానూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గాయని చిన్మయి, నటి ఖుష్బూతో పాటు పలువురు ప్రముఖులు ఆయన తీరును ఖండించారు. అటు సొంత పార్టీ నుంచి కూడా విమర్శలు రావడంతో డీఎంకే చర్యలు చేపట్టింది. అసలేం జరిగిందంటే.. ఓ కార్యక్రమంలో పొన్ముడి మాట్లాడిన వీడియో ఒకటి నెట్టింట వైరల్గా మారింది.



అందులో ఆయన సెక్స్ వర్కర్లు, కస్టమర్ల మధ్య సంభాషణ ఇలా ఉంటుందంటూ అసభ్యకర పదజాలాన్ని (రాయడానికి వీల్లేని) ఉపయోగించారు. ఇదంతా జోక్ అంటూ అతడు మాట్లాడిన తీరు మహిళలను కించపర్చేలా ఉంది. దీంతో అతడిపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలువురు ప్రముఖులు కూడా అతడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భాజపా నాయకురాలు, నటి ఖుష్బూ సుందర్ స్పందిస్తూ.. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్పై ప్రశ్నల వర్షం కురిపించారు. "మీ మంత్రి చేసిన వ్యాఖ్యలకు అర్థమేంటో నాకంటే బాగా మీకే తెలుసు. ఇలాంటి అవమానకర వ్యాఖ్యలను మీ ఇంట్లోని మహిళలు అంగీకరిస్తారా?" అని ఆమె ఆగ్రహించారు. ఆయనను వెంటనే మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిని ఆ భగవంతుడే శిక్షిస్తాడని గాయని చిన్మయి ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు డీఎంకే ఎంపీ కనిమొళి కూడా మంత్రి వ్యాఖ్యలను ఖండించారు. "మంత్రి పొన్ముడి వ్యాఖ్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. కారణం ఏదైనా సరే.. మహిళలపై అతడు చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండించాల్సిందే" అని ఆమె 'ఎక్స్'లో రాసుకొచ్చారు. ఇది కాస్తా వివాదాస్పదమవడంతో పొన్ముడిని డీఎంకే పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పదవి నుంచి తప్పించింది. కాగా.. పొన్ముడి ఇలా వివాదాల్లో చిక్కుకోవడం ఇదే తొలిసారి కాదు. గతంలో ఉచిత బస్సు సౌకర్యం గురించి మాట్లాడుతూ మహిళలను వలసదారులతో పోల్చడం విమర్శలకు దారితీసింది. ఇక, ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న అభియోగాలపై ఆయనకు మద్రాసు హైకోర్టు జైలుశిక్ష కూడా విధించింది. దీంతో ఆయన శాసనసభ్యత్వంపై అనర్హత వేటు కూడా పడింది. అనంతరం శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో తిరిగి మంత్రిమండలిలో చోటు దక్కించుకున్నారు.

# అప్పటి ఉగ్రదాడుల నుంచి త్రుటిలో తప్పించుకున్నా:అస్సాం సీఎం

ఉగ్ర దాడులు జరిగిన రోజు ముంబయి తాజ్ హోటల్లో బస చేయాల్సి ఉండగా.. తన షెడ్యూల్ మారడంతో మరో హోటల్లో దిగానని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తెలిపారు.

**దిల్లీ, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను జాతీయ దర్యాప్తు సంస్థ గురువారం ఢిల్లీకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆనాటి భయానక ఘటనను గుర్తుచేసుకున్నారు. ఉగ్రదాడులు జరిగిన రోజు తాను ముంబయి తాజ్ హోటల్లో బస చేయాల్సిఉండగా.. షెడ్యూల్ మారడంతో మరో హోటల్లో దిగానని తెలిపారు. దాంతో ఆ దాడుల నుంచి తృటిలో తప్పించుకోగలిగానని అన్నారు.



ఆ రోజు జరిగిన ఎన్ఎస్ఈ ఆపరేషన్ ఇంకా తన కళ్ల ముందు మెదులుతోందని, కర్మ సిద్ధాంతం ప్రకారం ఉగ్రదాడుల వెనక ఉన్న సూత్రధారులకు ఏదొకరోజు శిక్ష పడుతుందని తాను భావించానని తెలిపారు. "పదహారేళ్ల తర్వాత తహవ్వుర్ రాణాను దేశంలో చూస్తుంటే న్యాయవ్యవస్థపై మరింత విశ్వాసం పెరుగుతోంది. కేంద్రంలో ఉన్న బలమైన నాయకత్వం ఇటువంటి చర్యలు తీసుకోవడం ద్వారా భారత్పై దాడులు చేయాలంటే ముష్కరులు రెండోసారి ఆలోచిస్తారు" అని హిమంత బిశ్వశర్మ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ప్రపంచాన్ని వణికించిన ముంబయి ఉగ్రదాడి (26/11) ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ రాణా పాకిస్థాన్ మూలాలున్న కెనడా జాతీయుడు. ముంబయి దాడుల కుట్రదారుగా భారత్ ఆధారాలు ఇవ్వడంతో రాణాను 2009 అక్టోబరులో ఎఫ్బీఐ అరెస్టు చేసింది. షికాగోలో అతడిని పట్టుకుంది. అయితే తనకు ఇందులో భాగస్వామ్యం లేదని కేసు నుంచి తప్పించుకున్నాడు. 2011లో మరో కేసులో అతడు అరెస్టు కావడంతో 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అప్పటినుంచి భారత్ అతడి కోసం ప్రయత్నిస్తోంది. రాణాను భారత్కు అప్పగించడానికి ట్రంప్ ఇటీవల అంగీకారం తెలిపారు. దీంతో అక్కడి అధికారులు గురువారం అతడిని ఎన్ఐఏ అధికారులకు అప్పగించారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య అతడిని ప్రత్యేక విమానంలో తీసుకువచ్చిన ఎన్ఐఏ విమానాశ్రయంలోనే అతడిని లాంఛనంగా అరెస్టు చేసింది.

## చేబ్రోలు కిరణ్‌ను మంగళగిరి

# కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు

మాజీ సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెదేపా కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను పోలీసులు మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

**మంగళగిరి, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** మాజీ సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెదేపా కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను పోలీసులు మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపరిచారు. తొలుత మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో అతడికి ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. అనంతరం భారీ బందోబస్తు మధ్య కోర్టుకి తరలించారు. డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసులు న్యాయస్థానం వద్ద మోహరించారు. ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో వై.ఎస్. భారతిని ఉద్దేశించి కిరణ్ చేసిన అసభ్య వ్యాఖ్యలను తెదేపా అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. అతడిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని



కోరింది. ఆ వెంటనే మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్లో కిరణ్పై బెయిల్కు వీల్లేని కఠిన సెక్షన్ల కింద కేసు నమోదైంది. రంగంలోకి దిగిన పోలీసులు సెల్ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా విజయవాడ-ఇబ్రహీంపట్నం మధ్యలో కిరణ్కుమార్ ఉన్నట్లు గుర్తించి గురువారం అరెస్ట్ చేశారు.

# ఏపీ ఇంటర్ ఫలితాలు రేపే.. సులభంగా పొందొచ్చు ఇలా!

ఈ నెల 12న(రేపు) ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

**(రిపబ్లిక్ న్యూస్), ఏప్రిల్ 11:** లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ఏపీ ఇంటర్ ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. శనివారం (ఏప్రిల్ 12) ఉదయం 11గంటలకు ప్రథమ, ద్వితీయ ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తున్నట్లు ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాలను ఒకేసారి అందుబాటులోకి తెస్తున్నట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ ఫలితాలను, https://resultsbie.ap.gov.in వెబ్సైట్‌లో పొందవచ్చు. అంతేకాకుండా 'మన మిత్ర' సేవల ద్వారా ఇంటర్ ఫలితాలను వాట్సప్‌లోనే అందించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

### వాట్సప్ లోనూ పొందొచ్చిలా..

- మీ మొబైల్‌లో వాట్సప్ యాప్ ఓపెన్ చేయండి.
- 95523 00009 నంబరు 'Hi' అని మెసేజ్ పంపండి.
- రిప్లైలో వచ్చే ఆప్షన్లలో 'Select Service' అని ఎంచుకోండి.
- తర్వాత 'Education Services' అనే ఆప్షన్ క్లిక్ చేయండి.
- ఇంటర్ పరీక్షల ఫలితాలను డౌన్లోడ్ చేసుకోండి అని కనబడుతుంది.
- ఫలితాల డౌన్లోడ్ ఆప్షన్ యాక్టివ్ అయిన తర్వాత మీ హాల్ టికెట్ ఎంటర్ చేయండి
- ఆ తర్వాత కొద్ది నిమిషాలకు మీ వాట్సప్ నెంబర్‌కు వచ్చే ఫలితాలు/మార్కుల షార్ట్ మెమో పీడీఎఫ్‌ను డౌన్లోడ్ చేసుకోండి.




# రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపింది:కేటీఆర్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 3డీ మంత్ర (మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం) అమలు చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.

**హైదరాబాద్, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 3డీ మంత్ర (మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం) అమలు చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని.. సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని తెలిపారు.



రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని, రూ.10వేల కోట్ల కుంభకోణానికి ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. సీఎంకు భాజపాకు చెందిన ఓ ఎంపీ వెనుక నుంచి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారన్నారు. ఓ బ్రోకరేజ్ కంపెనీతో సంప్రదింపులు జరిపారని చెప్పారు. ఎస్ఆర్బీఎంను బైపాస్ చేసి డబ్బులు ఇస్తామని.. ఆ తర్వాత భూములు అమ్ముకోవచ్చని ఆ కంపెనీ తెలిపిందన్నారు. దీనికోసం అన్ని చట్టాలు, సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్బీఐ నిబంధనలను తుంగలో తొక్కారని కేటీఆర్ ఆరోపించారు. "తనకు అండగా నిలబడిన భాజపా ఎంపీకి సీఎం రేవంత్ అనుచిత లబ్ధి చేకూరుస్తున్నారు. కుంభకోణానికి సహకరించిన ఎంపీ పేరు వచ్చే ఎపిసోడ్లో బయటపెడతా. నిర్దిష్టమైన ఆధారాలతో కేంద్రానికి లేఖలు రాస్తాను. ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి తెలియకుండా ఇదంతా జరిగిందని అనుకుంటున్నా. రేవంత్రెడ్డి తెరతీసింది కేవలం ఈ 400 ఎకరాలకు మాత్రమే కాదు.. రూ.60వేల కోట్ల విలువైన హెచ్ఎండీఏ భూముల ద్వారా దోపిడీకి స్కెచ్ వేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1919:** అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఏర్పడింది.
- **1827:** భారతీయ సంఘ సంస్కర్త జ్యోతీరావ్ పులే జననం. (మ.1890)
- **1869:** భారత స్వాతంత్రోద్యమ కర్త కస్తూరిబాయి గాంధీ జననం.(మ. 1944) (చిత్రంలో)
- **1892:** భారతదేశ స్వాతంత్ర్య సమరయోధురాలు మిథుబెన్ పేటీట్ జననం.(మ.1973)
- **1904:** భారత ప్రఖ్యాత గాయకుడు, నటుడు కుందన్ లాల్ సైగల్ జననం.(మ. 1947)
- **1930:** భారతదేశానికి చెందిన యూరాలజిస్టు ఆదిపూడి రంగనాధరావు జననం.



ఐఎల్ఓ



జ్యోతీరావ్ పులే


కస్తూరిబాయి గాంధీ


మిథుబెన్ పేటీట్


కుందన్ లాల్ సైగల్


ఆదిపూడి రంగనాధరావు

రిపబ్లిక్ స్పోర్ట్స్

# 'యంగ్ వికెట్ కీపర్' నాయకత్వంలో పుంజుకొంటాం: రుతురాజ్

సీఎస్కే సారథ్యం మళ్ళీ మారింది. రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా దూరమయ్యాడు.

దీంతో అతడి స్థానంలో ధోనీని సారథిగా చేస్తూ మేనేజ్మెంట్ నిర్ణయం తీసుకుంది.




చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ మరో మ్యాచ్కు సిద్ధమైంది. కోల్కతా నైటైడర్స్తో తలపడనుంది. ఒక్కరోజు ముందు సీఎస్కే కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఎంఎస్ ధోనీ మళ్లీ సారథ్యం స్వీకరించాడు. గాయం కారణంగా రుతురాజ్ గైక్వాడ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. అయితే, డగౌట్ నుంచి సీఎస్కేకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని రుతురాజ్ వ్యాఖ్యానించాడు. ధోనీ కెప్టెన్సీపై రుతురాజ్ స్పందించాడు. ఆ వీడియోను సీఎస్కే తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది."ఐపీఎల్లో మిగతా మ్యాచులకు దూరం కావడం నిరుత్సాహానికి గురిచేస్తోంది. మోచేయి గాయం కారణంగా ఆడలేకపోతున్నా. ఇప్పటివరకు నాకు మద్దతుగా నిలిచిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. మాకు ఇది సవాల్ తో కూడిన సీజన్. అయితే, మాకు ఓ యంగ్ వికెట్ కీపర్ ఉన్నారు. అతడు జట్టును ముందుకుతీసుకెళ్తాడు. తప్పకుండా సీఎస్కే మళ్లీ విజయాలబాట పడుతుందని భావిస్తున్నా. స్క్వాడ్తోనే ఉంటా. డగౌట్ నుంచి మద్దతు ఇస్తూనే ఉంటా. కఠిన పరిస్థితుల నుంచి జట్టు బయటపడటం చూడాలనుంది. కొన్ని అంశాలు మన చేతుల్లో ఉండవు. మిగతా మ్యాచుల్లో కుర్రాళ్లంతా కలసికట్టుగా ఆడి సీజన్ను ఘనంగా ముగించాలని కోరుకుంటున్నా" అని గైక్వాడ్ వెల్లడించారు.

### విజయాల బాట పడితేనే..

ప్రస్తుతం చెన్నై ఐదు మ్యాచులు ఆడింది. కేవలం ఒకే ఒక్క విజయం మాత్రమే సాధించింది. నాలుగింట్లో ఓడిపోయింది. దీంతో పాయింట్ల పట్టికలో ఆఖరి నుంచి రెండో స్థానంలో కొనసాగుతోంది. మిగతా 9 మ్యాచుల్లో కనీసం 7 విజయాలు సాధిస్తేనే ప్లేఆఫ్స్ రేసులో ఉంటుంది. ఇవాళ కోల్కతాతో చెపాక్ లోనే సీఎస్కే తలపడనుంది. ఇది కాకుండా మరో మూడు మ్యాచులను సొంత మైదానంలో ఆడనుంది.

ఆస్కార్ అవార్డుల్లో కొత్త కేటగిరీ..

# 'ఆర్ఆర్ఆర్'కు దక్కిన గౌరవం

**ఇకపై ఆస్కార్లో కొత్త కేటగిరీలోనూ అవార్డులు ఇవ్వనున్నారు. దీనిపై అకాడమీ తాజాగా ప్రకటన విడుదల చేసింది.**

చలనచిత్ర రంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే అవార్డు ఆస్కార్. ఇప్పుడు ఇందులో మరో కేటగిరీ యాడ్ అయింది. ఇకపై 'స్టంట్ డిజైన్' జాబితాలోనూ అవార్డులు ఇవ్వనున్నట్లు అకాడమీ అధికారికంగా వెల్లడించింది. 2027 నుంచి విడుదల కానున్న చిత్రాలను ఈ జాబితాలో ఎంపిక చేసి అవార్డులు ఇవ్వనున్నారు. ఈ విషయంపై అకాడమీ నిర్వాహకులు మాట్లాడుతూ.. "సినిమా ప్రారంభం నుంచి చిత్ర నిర్మాణంలో 'స్టంట్ డిజైన్' భాగంగా మారింది. సృజనాత్మకత కలిగిన కళాకారులను ఈ కేటగిరీలో వినూత్నంగా గౌరవించడం మాకు గర్వంగా ఉంది" అని పేర్కొన్నారు. 100వ అకాడమీ అవార్డుల్లో ఈ జాబితాను అధికారికం చేయనున్నట్లు తెలిపారు. దీనిపై సినీ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.







'ఆర్ఆర్ఆర్'కు దక్కిన గౌరవం..

తాజాగా ఆస్కార్ కొత్త జాబితాను ప్రకటించే క్రమంలో ఒక పోస్టర్ విడుదల చేసింది. అందులో 'ఆర్ఆర్ఆర్' ఇమేజ్ను ఉపయోగించింది. హాలీవుడ్ సినిమాల సరసన మన 'ఆర్ఆర్ఆర్'ను చేర్చడం విశేషం. మూడు సినిమాల పోస్టర్లతో ఆస్కార్ 'స్టంట్ డిజైన్' గురించి వెల్లడించింది. 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్', 'ఆర్ఆర్ఆర్', 'మిషన్ ఇంపాజిబుల్' సినిమాల్లోని స్టంట్ల ఇమేజ్లతో దీన్ని ప్రకటించింది. దీంతో తెలుగు ఆడియన్స్ ఆనందిస్తున్నారు. ఇది మన భారతీయ సినిమాకు దక్కిన గౌరవమంటూ కామెంట్స్ పెడుతున్నారు. రాజమౌళి దర్శకత్వంలో రామ్చరణ్, ఎన్టీఆర్ నటించిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు ఉత్తమ ఒరిజినల్ సాంగ్ కేటగిరీ ఆస్కార్ సాధించిన విషయం తెలిసిందే.

### 100 ఏళ్ల నిరీక్షణ ఫలించింది:రాజమౌళి

ఆస్కార్లో కొత్త కేటగిరీపై రాజమౌళి స్పందించారు. "100 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. 2027 నుంచి విడుదలయ్యే చిత్రాలకు కొత్తగా స్టంట్ డిజైన్లోనూ అవార్డులు రానున్నాయి. దీన్ని సాధ్యం చేసినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు" అని పోస్ట్ పెట్టారు. దీని పోస్టర్ లో 'ఆర్ఆర్ఆర్' విజువల్ చూసి ఎంతో సంతోషమేసినట్లు తెలిపారు.

## కేన్స్కు జాన్వీ చిత్రం..

# భారతీయ సినిమా ప్రపంచాన్ని ఆకర్షిస్తోందంటూ పోస్ట్

'హోమ్ బౌండ్' సినిమా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్కు ఎంపికైంది. దీనిపై జాన్వీ కపూర్ పోస్ట్ పెట్టారు.



నీరజ్ మైవాన్ దర్శకత్వంలో వచ్చిన రెండో చిత్రం 'హోమ్ బౌండ్'. ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్, జాన్వీకపూర్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడీ సినిమా ఈ ఏడాది కేన్స్లో ప్రదర్శితం కానుంది. ఈ విషయం పై ఆనందం వ్యక్తంచేస్తూ జాన్వీకపూర్ పోస్ట్ పెట్టారు. "భారతీయ సినిమా ప్రపంచాన్ని ఆకర్షించే క్షణాలివి. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో 'హోమ్ బౌండ్' సందడి చేయనుంది. ఇది మా టీమ్కు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. దీన్ని మీ అందరి ముందుకు తీసుకురావడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అని ఇన్స్టాలో పోస్ట్ పెట్టారు. ఇక ఈ ఏడాది కేన్స్కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. దీనిపై నిర్మాత కరణ్ జోహార్ కూడా స్పందించారు. 'భారతీయ సినిమా శక్తికి 'హోమ్ బౌండ్' నిదర్శనం. మన కథల గొప్పతనం ప్రపంచానికి తెలుస్తోంది. ఈ విజయం మనం చిత్ర పరిశ్రమది. రానున్న చిత్రాలకు ఇది ఆశాకిరణం' అని ఇన్స్టాలో పోస్ట్ పెట్టారు. హైదరాబాద్కు చెందిన నీరజ్ దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం కూడా కేన్స్లో ప్రదర్శించారు. 2015లో ఇండస్ట్రీకి వచ్చిన ఆయన 'మసాన్' చిత్రం తెరకెక్కించారు. రిచా చద్దా, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా 2015లో కేన్స్లో ప్రదర్శించారు. ఇప్పుడు రెండో సినిమా కూడా ఈ ఫిల్మ్ ఫెస్టివల్కు ఎంపిక కావడంతో ఆయన్ని అందరూ అభినందిస్తున్నారు. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఈ ఏడాది మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్ వేదికగా జరగనుంది. ఈ చిత్రోత్సవాలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు గురువారం వెల్లడించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

దర్శకుడిగా తొలి సినిమా..

# ఎంతో భయంగా ఉంది: హృతిక్ రోషన్

దర్శకుడికి ఎన్నో సవాళ్లు ఉంటాయని తనకు తెలుసన్నారు హృతిక్ రోషన్. వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.



హీరోగా విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు స్టార్ హీరో హృతిక్ రోషన్. ఇప్పుడీ హీరో దర్శకుడిగా మారనున్న విషయం తెలిసిందే. 'క్రిష్ 4'కు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా దీనిపై ఓ ఈవెంట్ లో మాట్లాడుతూ.. ఎంతో భయంగా ఉందన్నారు. "నాకు దర్శకత్వంపై మొదటినుంచి ఆసక్తి ఉంది. కానీ, ఇప్పుడు భయపడుతున్నాను. మళ్లీ కొత్తగా స్కూల్కు వెళ్తున్నట్లు అనిపిస్తుంది. ఎందుకంటే ఇది నాకు పూర్తి భిన్నమైన రంగం. దర్శకుడు అంటే ఎన్నో సవాళ్లు ఉంటాయి. ఎన్నో పరిశోధనలు చేయాలి. భవిష్యత్తులో ఎందుకు దీన్ని ఎంచుకున్నానా అని కూడా అనిపిస్తుంది. ఇలాంటివి ఎన్నో ఎదుర్కోవాలి. అన్నిటికీ సిద్ధపడే దర్శకుడిగా అడుగులు వేస్తున్నా. ఎప్పుడూ మీ ప్రేమను గుర్తుంచుకుంటాను" అని తెలిపారు. ఇక హృతిక్ ఈ సినిమాను ప్రకటించిన నాటినుంచి దీనికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇందులో హృతిక్ త్రిపాత్రాభినయంలో కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. హీరో పాత్రతో పాటు విలన్గానూ కనిపించనున్నారట. బాలీవుడ్లోని అగ్ర నటీనటులు ఇందులో భాగం కానున్నారట. ప్రీతి జింటా, ప్రియాంక చోప్రా, వివేక్ ఒబెరాయ్, రేఖ ఇందులో నటించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అలాగే ఓ కీలక పాత్రలో నోరా ఫతేహి కనిపించనున్నట్లు సమాచారం.

## ఇంటి చిట్కాలు

# దోశ, ఇడ్లీ పిండి మిక్సీ పట్టేటప్పుడు ఒక స్పూన్ వీటిని కలిపితే పిండి చక్కగా పులుస్తుంది

మన ఇండియన్ బ్రేక్ఫాస్ట్లో ఇడ్లీ, దోశ చాలా మంది ఇష్టంగా తింటారు. చలికాలంలో వీటిని చేయాలంటే పిండి సరిగా పులవదు.

ఈ కాలంలో పిండి సరిగా పులవదు. అలా కాకుండా ఈ చలికాలంలోనూ పిండి సరిగ్గా పులవాలంటే ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో తెలుసుకోండి. చలికాలంలో ప్రతి ఒక్క విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. అలానే ఫుడ్ విషయంలో కూడా. ముఖ్యంగా బ్రేక్ఫాస్ట్ చేసినప్పుడు మనం ఎక్కువగా మనం ఇడ్లీ, దోశ చేస్తాం. అలా చేసినప్పుడు ముందుగా పిండిని నానబెడతాం. అయితే, ఈ పిండి ఎంత బాగా పులిస్తే అంత బాగా వస్తాయి టిఫిన్స్. కానీ, చలికాలంలో పిండి ఎక్కువగా పులవదు. ఆ పిండితో దోశ కానీ ఇడ్లీ కానీ చేస్తే గట్టిగా రాళ్ళలా వస్తాయి. అలాకాకుండా ఎలా పిండిని మిక్సీ పట్టాలి. ఎలా స్టోర్ చేయాలో తెలిస్తే పిండి చక్కగా పులుస్తుంది. మీరు ప్రతీ సీజన్లా బ్రేక్ఫాస్ట్ని ఎంజాయ్ చేయొచ్చు. అందుకోసం ఏం చేయాలో తెలుసుకోండి.



### మరమరాలు, మెంతులు..



పిండిని నానబెట్టేటప్పుడు టీ స్పూన్ మెంతులు కూడా వేసి నానబెట్టండి. దీంతో దోశలకి మంచి రంగు వస్తుంది. పిండి కూడా బాగా పులుస్తుంది. దీంతో పాటు మరమరాలు కలపండి. అవి కూడా దూదిలా ఉండే మరమరాలు కలిపితే పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా దోశలు, ఇడ్లీలు చక్కగా వస్తాయి.

### సరైన భాగాల్లో..



పిండి నానబెట్టేటప్పుడు మనం ఇడ్లీ రవ్వ, మినపప్పు, దోశకి బియ్యం ఇవన్నీ కూడా ఎంతమోతాదులో తీసుకోవాలో తెలిసి ఉండాలి. అప్పుడే ఇడ్లీ, దోశ పెర్ఫెక్ట్గా వస్తాయి. పిండి కూడా ఎక్కువగా పులుస్తుంది. కొంతమంది దోశల పిండికి బియ్యం ఎక్కువగా, మినపప్పు వేస్తారు. అదే విధంగా, ఇడ్లీకోసం మినపప్పు ఎక్కువగా రవ్వ తక్కువగా కలుపుతారు. అలా కాకుండా సరైన మోతాదులోనే తీసుకోండి.

### వేడినీటితో మిక్సీ పట్టడం..



మిక్సీ పట్టేటప్పుడు చాలా మంది నీటిని కలుపుతుంటారు. అయితే, చలికాలంలో వేడి నీరు మరీ ఎక్కువ వద్దు.. కొద్దిగా గోరువెచ్చని నీటిని పోసి మిక్సీ పట్టండి. దీని వల్ల త్వరగా పులుస్తుంది. అయితే, మరీ ఎక్కువ నీరు పోస్తే మిక్సీ జార్స్ పాడయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి, తక్కువగా అంటే గోరువెచ్చని నీరు మాత్రమే వాడండి.

### వేడిగా ఉన్న ప్రాంతంలో..



అదే విధంగా పిండిని వేడి ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో పెట్టండి. స్టౌ దగ్గర పెట్టడం మంచి పని. అదే విధంగా, ఎక్కువ టైమ్ పులియడానికి చూడండి. దీని వల్ల కూడా పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా, పిండిని ఉంచే గిన్నెలు కూడా కరెక్ట్గా ఉండేలా చూడండి. ఎలాంటి గ్యాప్ ఉండొద్దు.

### స్టీమింగ్..



మరీ ఎక్కువగా చల్లగా ఉన్నప్పుడు ఈ టెక్నిక్ బాగా ఉపయోగపడుతుంది. అదేంటంటే.. మిక్సీ పట్టిన పిండిని గిన్నెలో వేసి మరిగిన నీరు ఉన్న మరో గిన్నెలో పెట్టి దీనిని కప్బోర్డ్లో ఉంచి రాత్రంత్రా అలానే ఉంచండి. దీని వల్ల పిండి చక్కగా పులుస్తుంది. అదే విధంగా మైక్రోవేవ్లో కాసేపు ఉంచినా పిండి చక్కగా పులుస్తుంది.

### బేకింగ్ సోడా..




అదే విధంగా, కొద్దిగా మనం బేకింగ్ సోడా కలపొచ్చు. దీని వల్ల కూడా పిండి చక్కగా పులుస్తుంది. అయితే, ఇది ఆప్షనల్ మాత్రమే. ఎక్కువగా బేకింగ్ సోడా వద్దు. దీని వల్ల సమస్యలొచ్చే అవకాశం ఉంది.

